శుభదర్శనము

శ్రీమతి ఎస్. సీతామణిగారు

కాంతిచంద్రుఁ డిరువదియయిదువత్సరముల యువకుఁడు. ప్రథమభార్య మరణించిన వెనుక నాతఁడెవరికిని తనహృదయమునందు తావీయక, మృగములను, పక్షులను వేటాడుట యందు కాలము గడుపుచుండెను. అతఁడు చూచుటకు చాలనందగాఁడు. పొడవుగ పలుచగా నుండి యాతనిమూర్తి యాకర్షణీయముగానుండును. అతనిదృష్టి కడుతీక్ష్ణమయినది. అతఁడు తనవెంటఁ గొందరుచెలికాండ్రనుగయికొని తరచువేటకు వెడలుచుండును.

అతఁడొకపర్యాయముచెలికాండ్రతో నదీతీరముననున్న యరణ్యమునకు వేటకు వెడలినాఁడు. కాంతిచంద్రుని పరివారమంతయు పడవలలోనుండిరి. స్నానఘట్టములకేతెంచు యువతులు వీరలనుగాంచి స్నానమాడుట యసంభవమనియెంచి వెడలిపోవుచుండిరి. ఆదినమంతయు భూమియు నదియుకూడ తుపాకిధ్వనులచే కంపించిపోయెను.

ఒకనాటియుదయమున కాంతిచంద్రుఁడు తనతుపాకి సరిచేసికొనుచు తనపడవయందాసీనుఁడై అడవిబాతుయొక్క అరుపువిని తలయెత్తిచూచినాఁడు. గ్రామబాలికయొకతె రెండుబాతుపిల్లలను పట్టుకొని నదీతీరమునకు వచ్చుచుండుట యాతనికగపడినది. ఆబాలిక జలసమీపమునకువచ్చి రెండుబాతులను నీటియందిడి, దాపుననున్న వేటగాండ్రభయముచే సత్యాతురతచే వానిని వీక్షింపుచుండెను.

ఆబాలిక విశ్వకర్మశిల్పాగారమునుండి యప్పుడేయేతెంచిన ట్లతిమనోహరముగా నుండెను. ఆయమ వయస్సెంతయని నిర్ణయించుట చాలకష్టము. ఆమె యాకృతిలో యువతివలె నుండినను, వదనము బాల్యతను వ్యక్తపరచుచుండెను. ఆమె యౌవనమున నిప్పుడిప్పుడే యడుగిడినట్లుండెను.

కాంతిచంద్రునిపని యొకక్షణకాలమట్లే నిలిచిపోయెను. అతఁ డాబాలికామణినిగాంచి సమ్మోహితుఁడయ్యెను. అస్థలమునం దంతటిసౌందర్యవతిని చూడగలనని యాతఁడనుకొనలేదు. ఆమెసౌందర్యము రాజభవనమునకుతగియున్నను, ఆప్రదేశమే యామె కత్యంతరామణీయకతఁగూర్చెను. హేమకలశమందుండు పుష్పముకన్న, కొమ్మనుండెడి పుష్పమే యతిమనోహరముగనుండునుగదా? శరత్కాలపు మంచుబిందువులతోనిండియున్న రెల్లుపూవులు, యెండలోమెరయుచున్న యాదినమున యాబాలికావదనమండల మాతనిహృదయమున స్థాపితమైనది. అతఁడట్లు రెప్పవేయకుండచూచుచుండగనే యాబాలిక యస్పష్టసీత్కారమునుగావించి, రెండుబాతులనుచేర్చిపట్టుకొని నదీతీరమునువిడచి వెదురుపొదలలోదూరి యదృశ్యయయ్యెను. కాంతిచంద్రుఁడు వెనుకకుఁదిరిగిచూడఁగా తనసహచరుఁడొకఁడు తుపాకినొకదానిని, ఆబాతులవైపు గురిపెట్టియుండుటనుగాంచెను. కాంతి వానివద్దకేగి తుపాకిని మలిపిపట్టుకొని యాయపూర్వపరిహాసకుని చెంపపై నొకబలమగు కరాఘాతమును బ్రసాదించెను.

ఆబాలిక యెవరో కనుగొనవలయునను తలఁపుతో నాతఁడాబాలిక నిష్క్రమించిన వెదురుపొదలవద్దకు వెడలెను. అతఁ డాపొదలనొత్తిగించుకొని వెళ్లగా నొకగృహస్థుని దొడ్డి యాతనికిఁ గన్పించినది. ఆదొడ్డిలో నొకవైపున పూరిఁగప్పిన ధాన్యపురాసులపంక్తియు, రెండవవైపున శుభ్రమైన యొకపశువుల శాలయుఁగలవు. పశువులశాల కానియున్న రేఁగుపొదవద్ద ఉదయమున తానుగాంచిన బాలిక యాసీనయై విచారముతో గాయపడిన బాతుయొక్క పచ్చనిముక్కునందు కొంతజలమునుబోయుటకు ప్రయత్నించుచుండెను. ఒక గోధుమవర్ణపుపిల్లి యామెయొడిలో పాదములుంచి, పక్షిపై నతిక్రోధముగఁ జూచుచు ముందుకు జరుగుచుండెను. ఆబాలిక మార్జాలచక్రవర్తితలపై ఆదరపూర్వకముగా చఱిచి దానిని యథాస్థలమునందుంచుచుండెను.

శాంతియుతముగనున్న ఆమధ్యాహ్నమునం దాగృహమేధి యావరణములోని యాదృశ్యము కాంతిచంద్రుని సున్నితహృదయమున బాగుగాహత్తుకొనెను. రేఁగుఆకుల మఱుగుననుండి సూర్యుఁ డామెను మెల్లగా తొంగిచూచుచుండెను. కొంతదూరమునందొక యావు సుఖముగా నెమరువేయుచు, నిరంకుశముగా తనపై నధికారముచేయు యీఁగలను తోకతోఁ బరామర్శించుచుండెను. తూర్పుగాలి వెదురుపొదలఁ దోసికొని యతిమృదువుగా వీచుచుండెను. ఉదయమున నదీతీరమున వనదేవతవలె నగపడిన ఆబాలిక యానిశ్శబ్ద మధ్యాహ్నమున పవిత్రమైన గృహిణివలెనుండెను. కాంతిచంద్రుఁడు తనతుపాకితో నామె యెదుటికి వచ్చెను. బాతును గాయపఱచినవాఁడను నేనుగానని యాతఁడు చెప్పఁదలఁచెను. అతఁడెట్లుచ్చరింపవలయునా యని యాలోచించుచుండగా లోపలినుండి "సుధా"యను పిలుపువినవచ్చెను. ఆబాలిక యెగిరినిలచెను. మఱల యాపిలుపేతెంచినది "సుధా"యని. ఆమె తనబాతులను తీసుకొని పరుగెత్తివెళ్లిపోయినది. "సుధా". ఆహా! అన్వర్థనామధేయ గదా యీబాలిక అని కాంతిచంద్రుఁడనుకొనినాఁడు.

కాంతిచంద్రుఁడు తననావదగ్గరకువెళ్లి తుపాకినిపడవలోనివారికందిచ్చి, ఆయింటిసింహద్వారముదరికివెళ్లినాఁడు. అచ్చట మధ్యవయస్కుఁడగు సద్బ్రాహ్మణుండొకఁడు బల్లపై నాసీనుఁడై భక్తిరసప్రధానమగునొకగ్రంథమును జదువుచుండెను. ఆలోచనాపరుఁడగునాబ్రాహ్మణునివదనమున ఆబాలిక మొగమునందలి కోమలత్వముండుట కాంతిచంద్రుఁడుగాంచెను.

కాంతిచంద్రుఁ డాతనికి నమస్కారముగావించి "అయ్యా! కొంచెము మంచినీటికై మిమ్ముప్రార్థింపవచ్చునా?" అన్నాఁడు. ఆప్రౌఢబ్రాహ్మణుఁ డాతనినత్యాదరముతో బల్లపై నాసీనునిజేసి లోనికిఁజని యొకయిత్తడిపళ్లెములో కొన్ని భక్ష్యములును, కంచుకలశమున మంచితీర్థమును దెచ్చియిచ్చినాఁడు.

కాంతిచంద్రుఁడు భక్ష్యములనుతిని, మంచినీటిని త్రాగినవెనుక యాబ్రాహ్మణుఁడాతఁ డెవరైనది తెలుపుమనివేడినాఁడు. కాంతిచంద్రుఁడు తననామము, తనతండ్రిపేరు, విలా

సము కూడ చెప్పి "నాకేదియైన పనిచెప్పినచో నేను చాల ధన్యుడనని భావించెదను" అని మామూలుగా పెద్దవాడనే గౌరవముతో నడిగినాడు.

"కుమారా! నీకు చెప్పవలసిన పనియేమియు లేదు. కాని, యొక విషయమై నేనతి విషమావస్థలో జిక్కితిని." అని నవీనబెనర్జి అన్నాడు.

"అదేమి" అని కాంతిచంద్రుడడనెను.

"నాకుమార్తె సుధ వివాహయోగ్యయైనది. (ఆమె సుందరవదనమండలము జ్ఞప్తికి వచ్చుటచే కాంతిచంద్రుడించుకనవ్వుకొనెను.) ఆమె కనురూపవరుని కనుగొనలేకున్నాను. నేనామెకు వివాహమొనర్చినయెడల ఇహలోకమునందు నాబాధ నివారణమగును. కాని అనురూపవరుడెందును లేడు." అని నవీనబెనర్జి నిట్టూర్చినాడు.

"మహాశయా! మీరు నావయందు నన్ను కలిసికొనినచో మీతనయ వివాహవిషయమై ముచ్చటింతము." అని చెప్పుచు నాతనికి నమస్కారముగావించి కాంతిచంద్రుడు వెడలిపోయినాడు. అతడు తనపడవలోనివారిని కొందరిని ఆబాలిక వర్తనమరయుటకై గ్రామములోనికిపంపెను. వారిలో ప్రతియొక్కనివల్ల ఆబాలికయొక్క సౌందర్యము, సుగుణస్తోత్రము విని చాలసంతసించినాడు.

మఱునాటిదినము బ్రాహ్మణుడు అన్నమాటప్రకారము కాంతిచంద్రునివద్దకు వచ్చినాడు. కాంతిచంద్రుడడాతనికి సాష్టాంగనమస్కారముగావించి యాతనిపుత్రికను దనకొసంగుమని ప్రార్థించెను. కలనైనదలచని యీసంగతినివిని బ్రాహ్మణుడుక్కిరిబిక్కిరియయినాడు. కాంతిచంద్రుడు సద్బ్రాహ్మణకుమారుడు మాత్రమేకాడు; స్థితిపరుడుకూడ; కావుననే అబ్రాహ్మణుడేమియు జవాబుచెప్పలేకపోయినాడు. అతడెట్టకేలకు "నీవు నాపుత్రికను వివాహమాడ గోరుచున్నావా?" అని యడిగినాడు.

"మీరామెను నాకిచ్చుట కనుగ్రహించినచో" అని కాంతి అనెను.

"సుధ. ఆమెసంగతియేనా నీవు చెప్పునది" అని యాతడనెను. —"అవును."

"అయితే, అయితే నీవు మొదట ఆమెను చూడకుండ—"

ఆమెను చూడలేదని దొంగవేషమువేయుటకై కాంతిచంద్రుడర్థోక్తిలో నిట్లనెను: "ఓహో! అదియా? 'శుభదర్శనదినమున' చూచెదను."

"నాసుధ చాలమంచిబిడ్డ. గృహకృత్యములయందు చాలనేర్పుగలది. నీవు నిష్కపటముగా గైకొనుచున్న నాపుత్రిక నిన్నెన్న డసంతుష్టిపఱుపకుండునుగాక; ఇదియే నాదీవెన" యని సంభ్రమముతో నెలుగురాల్పడ నావృద్ధుడుపలికెను.

కాంతిచంద్రుడు కాలయాపనకోర్వనందున వివాహము మాఘమాసమున జరుపనట్లేర్పాటు చేయబడెను. నిర్ణీతసమయమునకు కాంతిచంద్రుడు పెండ్లికొడుకై ఏనుగుపై నెక్కివచ్చినాడు. మేళతాళములతో నుత్సవము ప్రారంభమయినది.

శుభదర్శనోత్సవానుకూలముగా దంపతులిరువురు రక్తవర్ణవస్త్రముచే గప్పబడినారు. వివిధాభరణాలంకృతయై, లజ్జాభరమున మస్తకము వాల్చియున్న యాబాలిక, నదీతీరమునందగుపడిన బాలికవలె లేనట్లాతనికిఁదోచెను. వివాహము యథాశాస్త్రీయముగా ముగిసినవెనుక ఆవివాహమంటపమునందున్న స్త్రీలలో నొకవృద్ధురాలీవలికేతెంచి పెండ్లికుమార్తె తలపైనున్న ముసుగుతీసివేయుమని కాంతిచంద్రునితోఁ జెప్పినది. ఆతఁడట్లుచేసి యాబాలిక కోమలవదనమండలము వైపుచూచి, తత్క్షణమే యసహ్యముతో వెనుకకుజరిగినాఁడు. నదీతీరమున తానుగాంచిన సహజసౌందర్యసుశోభితబాలికామణి కాదామె. జరిగిన ఈమోసమున కాతనిమనస్సున కలవరపాటుదయించినది. వివాహమంటపమునందలి శోభాయమానములగు దీపికలకాంతి వెలవెలబోవుచున్నట్లాతనికిఁదోచినది.

మొదట ఆతనికి మామగారిపైఁబట్టజాలనికోపమువచ్చినది. ముసలినక్క నాకొకపిల్లను జూపి వేఱొకపిల్లనుముడిపెట్టినాఁడని; కాని కొంత సేపటికి అవృద్ధుఁడెవ్వరినిచూపించలేదనియు నిదియంతయు స్వయంకృతాపరాధమనియు జ్ఞాపకమువచ్చినది. ఆతఁడు తనకలవరపా టెవ్వరికిని దెలియకుండ నెప్పటిస్థలమున నాసీనుఁడై యుత్సవమునందు పాల్గొన్నాఁడు.

ఆతఁడామెను కాదనిత్రోసివేయతగదు. తప్పక యామధురసుధ నాస్వాదించితీరవలెను. హతాశుండగు నాతని కాస్త్రీలపరిహాసవచనములు రుచింపకుండుటచే చిరచిరలాడ మొదలు పెట్టినాఁడు.

ముత్తయిదువుల పాటలతోడను, యువతీమణులపరిహాసములతోడను ఒకగంట గడచినది. ఒక కుందేలుపిల్ల దుముకుచువచ్చి వధువుయొక్క పాదములవద్ద కూర్చున్నది. దాని వెనుకనే కాంతిచంద్రునినయనానందతారకయగు బాలికయేతెంచి, ఆకుందేలును చేతగైకొని అత్యాదరముతో దానిని నిమురజొచ్చెను. "పిచ్చిపిల్ల. మూగపిల్ల" అని యామందిరమందలి యువతులందరు నామెను వెలికిఁబొమ్మని సంజ్ఞచేసిరి. ఆమెవారిని లక్ష్యపెట్టక, వధూవరుల యెదుట నిర్లక్ష్యముగా నాసీనయై, బాలికాజనోచితచాపల్యముతో వారివదనములవైపు చూడనారంభించెను. ఒక సేవకురా లరుదెంచి యామెను వెలికిఁగొనిపోవఁబ్రయత్నించెను. "ఆమె నచటనేయుండనిమ్ము." అని కాంతిచంద్రుఁడాదాసి నతిగాంభీర్యముతో నాజ్ఞాపించెను. "నీపేరేమి?" అని యాతఁ డాదాసివెడలిపోయినతరువాత నాబాలికను ప్రశ్నించెను. ఆమె వెనుకముందులకూగుటతప్ప జవాబీయలేదు.

కాంతి మరల ప్రశ్నించెను. "నీరెండు బాతుపిల్లలు యెదిగినవా?" అని.

ఆబాలిక వెనుకటివలె నిర్లక్ష్యముగాఁ జూచుటతప్ప జవాబుచెప్పలేదు.

విఫలప్రయత్నుఁడగు కాంతిచంద్రుఁడు మఱల ఆమె గాయపడిన బాతునుగుఱించి మృదువుగా ప్రశ్నించెను. జవాబులేదు; కాని యువతీమణుల హాసధ్వనులచే నామందిరము కంపించిపోయెను.

ఆబాలిక మూగయనియు, బధిరయనియు, వన్యమృగములసహచరియనియు కాంతిచంద్రుఁడు తెలిసికొనెను. విధివశమున నామె "సుధా"యను పిలుపు వినవచ్చినసమయమున లేచిపోవుట తటస్థించినది. కాని యామెపే రదికాదు.

కాంతిచంద్రుని కనులయెదుటినుండి నల్లని తెరయెత్తివేయబడినట్లయినది. విపదంధకారమునుండి విడివడిన ట్లాతఁ డొకనిట్టూర్పువిడిచి భార్యవదనమువైపు తేరిచూచెను. అదియే యాతనికి నిజమైన శుభదర్శనసమయమయ్యెను. దీపకాంతిసాహాయ్యమున భార్యసుందరవదనపద్మమున నవీనబెనర్జీ దీవెన సఫలమగు సూచనలను కాంతిచంద్రుఁడు గాంచెను.

—రవీంద్రునకనువాదము.

అనాథబాల

అంబటిపూడి నరసింహశర్మగారు

సీ. కంటిపూసలచేత గంటుబెట్టితివిగా తెలిముత్తెములలోని జిలుగువెలుగు
నిట్టూర్పుగాడ్పుల నీసడించితివిగా మొగలిరేకులలోని సొగసుమిసిమి
వెలిబెట్టితివిగదా తళుకుమేన్నిలుపక అలరుపానుపులోన నలరుసుకము
చిన్నబుచ్చితివిగా కన్నులమూయక కలువకన్నెలమహోజ్జ్వలపుకలిమి
చివురు లవిసిపోయె చెదరెచుక్కలరాజు
పవడమువడదాకి పగిలిపోయె
పర్వతములుప్రీలె పైడిచుక్కలురాలె
నాథిగ్రుంగకుము అనాథబాల!

ఉ. నీచతురోక్తికామృతధునీరసవీచులనోలలాడఁగా
నోచనిదీప్రపంచము, గుణోజ్జ్వలరూపవిశేషదీప్తిచే
పూచినమల్లెపందిరినిబోలిన నీనవయావనప్రభా
రోచులు నీయభాగ్యమునఁగ్రుంకె యనాథరో! రూపుమాసెఁగా.

సీ. పద్మరాగప్రభాపాటలమ్మొడగూర్చు రక్తవిద్రుమలసద్రక్తిమమ్ము
నీలంపురాతళ్కు గీలించుపిరివిగ నీలాంబుదప్రభాజాలకమ్ము
హేమకట్టిచుపుమేల్గోములగదియించు పసుపువన్నియతీవమిసిమిదనము
అమృతధారాప్రవాహముల దేలించు నీసరసార్థమొలుకువచఃప్రవృత్తి
వెన్నెలలగాయుపూర్ణిమావిధునికాంతి
సతతమూరించునేర నీచక్కదనము
అన్నియున్నవికాని యోయనద! నీదు
సొగసుసంపద కాననజ్యోత్స్న యయ్యె.